క్లుప్తంగా

జోన్-5 ఏసీపీ, టీపీవోల బాధ్యతల స్వీకరణ


విధుల్లో ఏసీపీ రామకృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ)గా రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్(టీపీవో)గా విజయ్‌కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉత్తర్వుల మేరకు జోన్-5కు బదిలీ అయినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీపీ రామకృష్ణ మాట్లాడుతూ జోన్ పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, చిత్తశుద్ధితో పనిచేసేలా కృషి చేస్తానని తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై దృష్టి సారించాలని టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. జీవీఎంసీ 40వ వార్డు నుంచి 63 వరకు వార్డులకు సంబంధించి అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు జీవీఎంసీ ప్లాన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని జోన్ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన


ప్రొఫెసర్ వీనా స్పందనకు జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

దాబాగార్డెన్స్: కమ్యూనికేషన్ స్కిల్స్‌పై స్థానిక ఏవీఎన్ కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రొఫెసర్ వీనా స్పందన మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్‌లో నూతన సాంకేతిక విధానాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఆంగ్ల విభాగాధిపతి పైడి రజని మాట్లాడుతూ ఇంగ్లిష్ భాష ప్రపంచాన్నే శాసిస్తోందని, ఆ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల అధ్యాపకురాలు వినీత సూర్య ప్రసన్న, జీవీఎస్‌వీఎల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జనరల్ యోగా తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 13 నుంచి జనరల్ యోగా, థెరపి యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు నాలుగు బ్యాచ్‌లుగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ అధికారులకు ఐఐఎంలో శిక్షణ

ఏయూ క్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ అధికారులకు ఐదు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రొగ్రాం సోమవారం ప్రారంభమైంది. 23 మంది హెచ్‌ఎస్‌ఎల్‌కు చెందిన మేనేజర్లు హాజరైన ఈ శిక్షణలో ముఖ్యఅతిథిగా హెచ్‌ఎస్‌ఎల్ జనరల్ మేనేజర్ ఎస్.అశోక్‌కుమార్ మాట్లాడుతూ నిరంతర అభ్యసనం ప్రాధాన్యతను వివరించారు. ఐఐఎంవీ డీన్(పరిపాలన) ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ నాయకత్వాన్ని పెంచేలా వివిధ సంస్థల అధికారులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమ సంచాలకుడు ఆచార్య బాలాజి సుబ్రమణియన్, తదితరులు ప్రసంగించారు.

అతిపెద్ద నేరగాడు చంద్రబాబు

- యువత జీవితాలను నాశనం చేశాడు
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: దేశంలోనే అతిపెద్ద నేరం చంద్రబాబు చేశాడని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పేర్కొన్నారు. 50 లక్షల మందికిపైగా యువతీయువకుల జీవితాలను చంద్రబాబు నాశనం చేశాడన్నారు. ఆశీల్‌మెట్ట సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం చంద్రబాబు అరెస్టు జరిగిందని స్పష్టం చేశారు. చంద్రబాబును ప్రతిపక్ష నాయకుడిగానే చూశాం. మాకు..మా పార్టీకి ఆయనతో శతృత్వం లేదన్నారు. ఒకవేళ కక్షపూరితంగా చేయాలనుకుంటే 2019 ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబుని, అచ్చెన్నాయుడ్ని జైల్లో పెట్టేవారమన్నారు. తప్పు చేస్తే శిక్ష తప్పదని చంద్రబాబు విషయంలో రుజువైందన్నారు. రాష్ట్రంలో ఒక్క రూపాయి అవినీతి లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తూ, రాష్ట్రానికి మంచి పేరు తీసుకువస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అరెస్టుపై జనసేన అధ్యక్షుడు పవన్ చేసిన అతి జనం గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపునకు పాల్పడుతోందని ఆయన చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన అవినీతి తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. అచ్చెంనాయుడు ఈఎస్‌ఐ స్కాంలో శిక్షపడాల్సి ఉందని, త్వరలోనే ఆయన కూడా జైలుకు వెళ్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అమరావతి భూముల విషయంలో చంద్రబాబు, నారాయణ అండ్ కో బృందం జైలు ఊచలు లెక్కించడం ఖాయమన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ సెప్టెంబర్ 10 న్యాయం గెలిచిన రోజని పేర్కొన్నారు. చేతిలో మీడియా ఉందని ఇంత వరకు అహంకారంతో రెచ్చిపోయిన చంద్రబాబు శేషజీవితంలో జైలులో గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటి నుంచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని పిలిచేవారమని, నేటి నుంచి ఆయనను ఖైదీ నెంబరు 7691 అని పిలిస్తే బాగుంటుందని చెప్పారు. పవన్ కల్యాణ్‌ను నమ్ముకుంటే జనసైనికులు నట్టేట మునిగిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సబీరా బేగం, బోని దేవా, బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

26వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం 26వ రోజుకి చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారాల నిర్వహణకు మార్కింగ్


తోపుడు బండ్ల వద్ద వైట్ మార్కింగ్ వేయిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కరరావు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు సృష్టిస్తున్న వ్యాపారులకు ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర రావు, పోలీసులు చెక్ పెట్టారు. పూర్ణామార్కెట్ వద్ద నిత్యం తోపుడు బండ్లు, చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు సమస్యకు కారణమవుతున్నారన్నారు. రహదారిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల రోజూ ట్రాఫిక్ నిలిచిపోయి వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రహదారికి ఫుట్‌పాత్ వద్ద వైట్ కలర్ లైను వేశామని ఎస్‌ఐ తెలిపారు. వ్యాపారులు పోలీసులు చూపించిన లైన్ దాటిరాకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తోపుడు బండ్ల వ్యాపారులు దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనలు దాటి ముందుకొచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని చిరు, తోపుడు బండ్ల వ్యాపారులను ఎస్‌ఐ భాస్కరరావు హెచ్చరించారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 3, వాటర్ సప్లై విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడీస్ తెలిపారు. ఆయా విభాగాల అధికారులకు వాటిని అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బాబూరావు, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బంద్ విఫలం

- యథావిధిగా రోడ్డెక్కిన బస్సులు, ఆటోలు
- తెరుచుకున్న దుకాణాలు, షాపింగ్ మాల్స్


పూర్ణామార్కెట్ వద్ద యాథావిధిగా తెరుచుకున్న దుకాణాలు

దాబాగార్డెన్స్/జగదాంబ/అల్లిపురం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం 14 రోజుల పాటు రిమాండ్ విధించిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం తలపెట్టిన బంద్ ప్రభావం ఎక్కడా కానరాలేదు. యథావిధిగా ఆర్టీసీ బస్సులు నడిచాయి. ఆటోలు తిరిగాయి. దుకాణాలు తెరుచుకున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు మూతపడలేదు. ఉద్యోగస్తులు, కార్మికులు తమ విధులకు హాజరయ్యారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చిన టీడీపీ నేత గండి బాబ్జీని పోలీసులు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

- బంద్ ప్రభావం పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఎటువంటి ప్రభావం చూపలేదు. మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలు యాథావిధిగా కొనసాగాయి.

రద్దీగా జంక్షన్లు

కంచరపాలెం: జ్ఞానాపురం, కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాస ప్రాంతాల్లో బంద్ ప్రభావం కానరాలేదు. చిరువ్యాపారులు, వర్తకులు దుకాణాలు తెరిచి వ్యాపారాలు కొనసాగించారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు యథావిధిగా తిరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. కంచరపాలెం రైతుబజారు వినియోగదారులతో కళకళలాడింది. కంచరపాలెం జంక్షన్‌లో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అటవీ సిబ్బందికి అంకితభావం అవసరం


అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి

ఆరిలోవ: అటవీ సిబ్బంది అంకిత భావంతో పని చేయాలని విశాఖ రేంజ్ సీసీఎఫ్ శ్రీకంఠనాథ రెడ్డి సూచించారు. అటవీ అమర వీరుల దినోత్సవాన్ని సోమవారం ఇందిరాగాంధీ జూపార్కు, కంబాల కొండలో నిర్వహించారు. ముందుగా జూలో అమర వీరుల చిత్రపటాలకు ఆయనతో పాటు డీఎఫ్‌వో అనంతశంకర్, జూ క్యూరేటర్ నందనీ సలారియా, సిబ్బంది పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కంబాలకొండలో అమర వీరుల స్థూపం వద్ద అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీసీఎఫ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో మంది అటవీ శాఖ సిబ్బంది తెగువ, ధైర్య సాహసాలు చూపి అమరులయ్యారని గుర్తు చేశారు. అడవుల సంరక్షణలో నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

బీచ్‌రోడ్డులో సప్తగిరి సందడి


భీమిలిలోని ఓ రెస్టారెంట్‌లో నటుడు సప్తగిరి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో సోమవారం నటుడు సప్తగిరి సందడి చేశారు. ఇక్కడి బీచ్ సమీపంలోని కొబ్బరి తోట వద్ద, భీమిలిలో గల ఓ రిసార్ట్‌లో ఆయన నటిస్తున్న సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ సినిమాకు పి.సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం టైటిల్ ఖరారు చేయలేదని, త్వరలోనే పూర్తి వివరాలు తెలుపుతామని ఆయన అన్నారు.

విశాఖలో తిలక్ విగ్రహం ఏర్పాటుకు వినతి


ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందజేస్తున్న లక్కోజు

దాబాగార్డెన్స్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేళ.. జాతీయోద్యమ నేత బాలగంగాధర్ తిలక్ విగ్రహాన్ని విశాఖ నగరంలో ఏర్పాటు చేయాలని జ్యోతిష్య పండితుడు లక్కోజు శివరామ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. విభజించు, పాలించు అనే వ్యవస్థ నుంచి మనమంతా ఒక్కటే, మనమే సంఘమంటూ బ్రిటిషర్లను భారత ప్రజలు ఎదురించే స్థితికి తిలక్ తీసుకొచ్చారని లక్కోజు తెలిపారు. ఎంవీవీ వెంట ప్రముఖ ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు ఉన్నారు.

బస్ బే పనుల పూర్తి

యథావిధిగా బస్సుల రాకపోకలు



మరమ్మతుల అనంతరం.. ఆర్టీసీ కాంప్లెక్స్ సౌత్‌సైడ్ బస్ బే

సీతమ్మధార: విశాఖ సెంట్రల్ పార్కు ఎదురుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక నూతనంగా నిర్మించిన బస్ బే మరమ్మతు పనులు పూర్తయ్యాయి. దీంతో యథావిధిగా బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షానికి కుంగిపోయిన ఈ బస్ బేను సరిచేశారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ ఇంజినీరింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ బస్సుల కోసం వేచి ఉండే విద్యార్థులు, ఉద్యోగులు, యువత, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఐడీఆర్‌సీ తరగతులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవ వనరుల అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో పర్యావరణ శాస్త్రంపై ఇంటర్ డిసిప్లీనరీ రిఫ్రెషర్ కోర్స్ నిర్వహించనున్నట్టు హెచ్‌ఆర్‌డీసీ కేంద్రం సంచాలకుడు ఆచార్య టి.వి.కృష్ణ తెలిపా రు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు సమన్వయకర్తగా ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు ఇ.ఉదయ భాస్కర రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు.

గణపతి ఉత్సవాలకు పందిరి రాట

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం లక్ష్మీనారాయణపురంలో యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినాయ చవితి వేడుకలకు పందిరి రాట వేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఫౌండర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది కూడా ఈ ప్రాంతంలో సందేశాత్మకంగా, ఘనంగా వినాయక చవితి నవరాత్రి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాస్కర రావు, పద్మావతి, నరేంద్ర, లక్ష్మి, దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమాజంపై సాహిత్య ప్రభావం


కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

మద్దిలపాలెం: సాహిత్యం.. సమాజంపై తీవ్ర ప్రభావం చూపిందని ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్ అన్నారు. మద్దిలపాలెం డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సోమవారం పద్మశ్రీ అవార్డు గ్రహీత, రచయిత ఇనాక్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయ బాబు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఘనంగా సత్కరించారు. ఇనాక్ మాట్లాడుతూ గుంటూరు ఏసీ కళాశాల అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇప్పటి వరకూ 104 పుస్తకాలు రచించానన్నారు. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అధ్యాపకురాలు ఆర్.కుసుమ, ఎస్.శారద, గోపాల నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి దాతృత్వం


చీరాల రాంబాబుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: వైద్య సహాయం చేయాలంటూ ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పందించి దాతృత్వం ప్రదర్శించారు. సోమవారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. కిడ్నీ, లివర్, పక్షవాతంతో బాధపడుతున్న 37వ వార్డు పెయిందొరపేటకు చెందిన చీరాల రాంబాబుకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఓమ్నీ ఆస్పత్రిలో ఉచితంగా వైద్యం చేయించి, అనంతరం నేరుగా ఆయన ఇంటికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మందుల కొనుగోలుకు రూ.5వేలు సాయం అందజేశారు.

- 33వ వార్డు కంతంవారి వీధికి చెందిన వైఎస్సార్ సీపీ గృహసారథి లీల ఐజవరపు కొద్ది నెలలుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా అపోలో ఆస్పత్రిలో డయాలసిస్ చేయించారు. తన ఇంటికి వెళ్లి రూ.5వేలు అందజేయడమే గాక, జీవన్‌ధార ద్వారా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు.
- పార్టీ కార్యకర్త ఈతలపాక విజయ్ లివర్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న దృష్ట్యా మందుల ఖర్చులకు రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ 37వ వార్డు అధ్యక్షుడు నొల్లు పోతుస్వామి, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నీలకంఠం, ముజీబ్‌ఖాన్, బోని దేవా, వెంకటలక్ష్మి, రామరాజు, రోజా, వసుంధర, గురులక్ష్మి, బొడ్డేటి ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, రమేష్, చిన్నమ్మలు, చంద్రకళ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పోలీసుల అదుపులో దొంగ


రైల్వేస్టేషన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న సతీష్‌తో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని సోమవారం గవర్నమెంట్ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. సోమవారం ఉదయం విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై స్లీపర్ క్లాస్ వెయిటింగ్ హాల్ వద్ద జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి తనీఖీలు చేస్తున్న సమయంలో స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న కడిమిశెట్టి సతీష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి సుమారు 9 గ్రాముల బంగారంతోపాటు ముత్తూట్ ఫైనాన్స్‌లో గోల్డ్‌లోన్ ద్వారా తాకట్టు పెట్టిన మరో 46 గ్రాముల బంగారాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్‌ఐ బి.అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందరితో మర్యాదగా నడుచుకోండి

పార్సిల్ సర్వీస్ సిబ్బందితో ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఈడీ రవికుమార్


పార్సిల్ సర్వీస్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న ఈడీ రవికుమార్ తదితరులు

అల్లిపురం: ఏపీఎస్ ఆర్టీసీ పార్సిల్ కౌంటర్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మసులుకోవాలని సిబ్బందికి ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ సూచించారు. ద్వారకా బస్ స్టేషన్ ఆవరణలో కొత్తగా ప్రారంభించిన మెసెర్స్ సింగ్ సొల్యూషన్స్ వారి హ్యాండింగ్ అవర్ టేకింగ్ ఓవర్ పార్సిల్ సర్వీస్ గొడౌన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్సిల్ సర్వీస్‌లో పనిచేస్తున్న సిబ్బంది అందరూ పార్సిల్ సర్వీస్‌ను మరింత అభివృద్ధి చేసి కస్టమర్లు, ప్రయాణికులకు మరింత చేరువ కావాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ ఎ.అప్పలరాజు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సత్యనారాయణ, ఏటీఎం కమర్షియల్ రాజు, ఏటీఎం టీవీఎస్ అమర్ సింహ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విల్లూరి పుట్టిన రోజు వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్డు కార్యాలయంలో కేక్ కట్ చేసిన ఆయన వార్డులో చేపట్టిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెలంపేటలో చీరలు, ఫ్రూట్ మార్కెట్‌లో కూలీలకు దుస్తులు, పండ్లు, దుర్గాలమ్మ ఆలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విల్లూరి మాట్లాడుతూ వార్డులో ప్రజలు, కార్యకర్తలు స్వతహాగా వచ్చి చేసిన సేవా కార్యక్రమాలు మరచిపోలేనన్నారు. అందరికీ తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గొరిశంకర్, నిమ్మ శ్రీను, గుజ్జు సురేష్, వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు'


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచనలు చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం తన కార్యాలయంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు రచించిన ‹ఫిలసాఫికల్ పర్స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్›పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భవిష్యత్ తరం ఉపాధ్యాయులుగా నిలిచే వారికి, ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారికి ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం అభినందనీయమన్నారు. పరిశోధకులకు ఈ పుస్తకం ఒక చక్కని మార్గదర్శికంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం పుస్తక రచయిత షారోన్‌రాజును వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసరింహారావు, ఆచార్య రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

అక్కరమాని ఆటో బహూకరణ


మస్తాన్‌కు ఆటో అందజేస్తున్న అక్కరమాని విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు అక్కరమాని విజయనిర్మల సోమవారం పార్టీ కార్యకర్త మస్తాన్‌కు ఓ ఆటోను బహూకరించారు. సోమవారం అక్కరమాని జన్మదినాన్ని పురస్కరించుకుని మస్తాన్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు తన సొంత నిధులతో ఈ కానుకను అందజేశారు. ఎంవీపీ కాలనీలో అక్కరమాని క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. అక్కరమాని జన్మదినాన్ని పురష్కరించుకొని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. పలు వార్డులో వృద్ధులకు చీరల పంపిణీతో పాటు 18వ వార్డులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అక్కరమా బాబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.